# ప్రత్యామ్నాయం

ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుకుంటున్నాయి. ఊరంతా చీకటి దుప్పటి కప్పుకుంది. చిత్తడి, చిత్తడిగా ముసురు ... వైరస్ ఫీవర్‌లా రెండు రోజుల నుంచీ ఊరిని పట్టుకుంది. వీచిన హోరుగాలికి, విద్యుత్ స్తంభాల వైర్లు తెగిపోయి, విద్యుత్ ఆగిపోయింది. విద్యుత్ స్తంభాలకు వెలగని బల్బులు కొమ్మలకు వేలాడే గబ్బిలాల్లా వున్నాయి. ఊరిబయటి తోటలోంచి చింతగిరొకటి ... అదే పనిగా పంచాయితీ వారి రేడియోలా గీపెడుతోంది.

నాయుడువీధి వంట పంచల్లోంచి పొయ్యిల్లో చిదుగులు చిటచిటా, పటపటా, చిటాపటా ... మండుతున్నాయి. నాయుడువీధి సాలల వాసలో వున్న చంద్రమ్మ పొయ్యి కిందకీ, పొయ్యి మీదికీ ఏమీలేక, నులక మంచమెక్కేసింది. కిరసనాయలు అయిపోయి, దీపం ఆరిపోయింది. కడుపులో ఆకలి కేకలు వేస్తున్నాయి ప్రేగులు! దానికి తోడుగా పొద్దుటి నుంచీ ... చంద్రమ్మకు నోరు చేదుగా వుండి, సాయంత్రానికి జ్వరం తగిలింది. జ్వరానికి, ఉపవాసం మంచి దంటారు లంఖణం పరమౌషధం అని! నులకమంచం మీద మూలిగే ఓపిక గూడా లేక ... పడుకుంది చంద్రమ్మ.

“చెంద్రప్పా ! అగ్గేసావా?” పొరుగు పాకలోంచి కేకేసింది అయ్యవారమ్మ! చంద్రమ్మ నుంచి జవాబు లేదు. అయ్యవారమ్మ రెండడుగులు చంద్రమ్మ పాకవైపు నడిచి, తడిక మీద నుంచి చూస్తూ – “చెంద్రప్పా” అని మళ్ళీ పిల్చి చూసింది. చంద్రమ్మ పడుకోవటం కన్పించి, గబగబా వచ్చింది. కప్పుకున్న కోక గుడ్డ చాలక ... గజగజా వొణుకుతోంది చంద్రమ్మ. అయ్యవారమ్మ చంద్రమ్మ నుదుటి మీద చేయివేసి – “ఊస్టమొచ్చినట్టుగుంది. చీకటింటిల తొంగున్నావేమీ? దీపం బుడ్డీ యేదీ? ఎక్కడుంది...?” అనడిగింది చంద్రమ్మను.

చంద్రమ్మ బాధగా వొత్తిగిలి – “కిరసనూని అయిపోయి ఆరిపోనాది బుడ్డీ. మరిపుడేల బుడ్డీ? తొంగేడమే గదా?” అని నీర్సంగా జవాబిచ్చింది.

“వొంటసెయ్యివేటి? ఏటీ తిన్లేదుగావాల? కొంచిం కషాయింజేసి తెచ్చీదేటయితే?” అనడిగింది అయ్యవారమ్మ. చంద్రమ్మ ఒద్దనలేదు. అయ్యవారమ్మ కషాయం చేయడానికి తన ఇంటికి వెళ్ళింది. చంద్రమ్మ కప్పుకున్న కోకగుడ్డ కాళ్లతో సర్దుకోసాగింది. ముసురు...

జ్వరం పెరిగినట్లు పెరుగుతోంది. ఆ చలిలో, ఆ చీకటి రాత్రి, ఆ జ్వరతీవ్రతలో ఏ స్మృతులు జ్ఞప్తికొచ్చేయో సన్నగా ఏడ్వసాగింది చంద్రమ్మ. ఆ ఏడుపు, బందిలదొడ్డిలో ముసిలి ఆవు ఆర్తనాదంలా విన్పిస్తోంది.

కషాయం తపేలాని పొయ్యిమీద పెట్టి, ఏడుపు విన్పించటంతో ఓ చేత్తో బుడ్డీ పట్టుకుని చంద్రమ్మ దగ్గరకొచ్చింది అయ్యవారమ్మ. బుడ్డీని ద్వారబంధం మీద పెట్టింది. వెల్తురు మంచం మీదుగా తడకల వరకూ ప్రాకింది. పెద్దపెద్ద కన్నాలతో ఇనుప జల్లెడలా నులకమంచమూ జల్లెడలో గుడ్డకప్పిన అస్తిపంజరంలా చంద్రమ్మ నీడలు తడికమీద పడ్డాయి. నీడకి ఎదురుగా అయ్యవారమ్మ!

"ఊస్టంతోటి ఏడగూడదు. మరింతెక్కువైపోద్ది. ఎంతని ఏడుస్తావు? ఏడిస్తే వొచ్చిన కస్టబాధలు పోతాయేటి? ఓర్చుకోడిమే! వల్లకో. ఏడకేడకు..." అని ఓదార్చసాగింది అయ్యవారమ్మ.

చంద్రమ్మ కాళ్ళు కూడదీసి, లేచికూర్చోని, ముక్కుయొగచీది, కాండ్రించి ఉమ్మింది ... ముంజూరు అవతలకి. మళ్ళీ కాళ్ళు చాపి, చేరబడి –

"...కాటికి కాళ్ళు సాపీ కాలానికీ కస్టాలు తీరలేదు. ఎంతమరి రాయించుకొచ్చేనో ఆ బ్రెమ్మదేవుడి కాడ! కనీ, పెంచిన కొడుక్కే బరువయిపోనాను. ముచ్చ్య (మృత్యు) దేవత నన్నొదిలీసి అతగాన్ని పట్టుకు పోనాది. ఎలిపోనాడు మాన (మహాను) భావుడు! నీ నెపుడు పోతానా అని సూస్తండు కొడుకు..." అని వాపోయింది చంద్రమ్మ.

అయ్యవారమ్మ మౌనంగా వింటూ, ఎదురింటివైపు చూసింది. ఎదురింటిలో దీపపు వెలుతురు ... తలుపు సందులోంచి కన్పిస్తోంది. ఆ ఇంట్లోంచి పిల్లలగోల ... చిన్నగా విన్పిస్తోంది.

ప్రతి ఇంటికీ వీధి తోవకు కొంతజాగా పోగా, ఎదురుగా పశువుల సాల వుంటుంది. పెద్ద రైతులు కుదేలయిపోతే – పశువులు చెల్లిపోతాయి. సమిష్టి కుటుంబాలు వేరుపడితే ... పశువుల సాలలు ఇళ్ళుగా మారుతాయి! అలా మారిన పశువులసాల ఇంటిలోనే చంద్రమ్మ వుంటోంది. ఎదురింటిలో కొడుకు సంసారం.

ఎదురింటి వీధి తలుపు తెరుచుకుంది. వెల్తురుతోపాటూ ఎనిమిదేళ్ళ రోజా అన్నం పల్లెం ఒక చేతా, హోంవర్క్ నోట్‌బుక్ మరోచేతా పట్టుకొని తల్లి వెనకాలే వచ్చింది. వాళ్ళ అమ్మ వీధివైపు చూస్తోంది. రోజా అన్నం పెట్టమని అమ్మను వేధిస్తోంది. ఈలోగా ఇంట్లోంచి చిన్న కుర్రాడు శంకర్ వొచ్చి 'అమ్మా! ఆకలే' అని అరుస్తూ, తల్లి కాళ్ళను చుట్టుకొని గుంజుతున్నాడు. బియ్యం తెస్తానని వీధిలోకి వెళ్ళిన భర్త ఎంతకీ రాడు. పొయ్యిమీద ఎసర కెరలిపోయి మరుగుతోంది.

"ఈదిలోకెళ్తే ఇల్లు మర్చిపోతాడు! ఏ పెద్ద గుర్రం పళ్ళుదోముతాడో ... ముండ్రాల పెద్దమనిసి" అంటూ, భర్తను దూషిస్తూ, అతని రాకకోసం చూస్తోంది. కాళ్ళను చుట్టిన కుర్రాడు రాగం స్థాయి పెంచాడు. అసలే చిరాగ్గా వున్న ఆమె పిల్లలిద్దరి వీపులమీదా దబ, దబా దరువులు వేసేసి –

"...ఆకలేస్తే నన్ను తినీయర్రా! ముండమంద పుట్టీసినారు. ఎపుడూ ఆకలిగోలే. వొండినదాకా వుండలేనోళ్ళు ... పండినదాకా వుంటారా? పడలేకపోతన్నాను మీతోటి..." అని కేకలు వేసింది.

ఆ దరువులకూ ఆ కేకలకూ, ఆ ఇద్దరు పిల్లలూ ఏడ్పు ఎగబెట్టుకొని కిక్కురుమనకుండా ఇంట్లోకి పారిపోయేరు. ఆమె వీధి తలుపు మూసేసుకొని, ఇంట్లోకి వెళ్ళిపోయింది. అయ్యవారమ్మ ఎదుటి దృశ్యమంతా చూసి, దీర్ఘంగా నిట్టూర్చి –

"...కషాయిం మరిగిపోయుంటాది. వొట్టుకొస్తానుండు..." అని చెప్పి లేచింది.

అయ్యవారమ్మకు అంతా అయోమయంగా వుంది.

ఎలాంటి చంద్రమ్మ...!?

* * *

పాతికేళ్ళ కిందట!

నీలకంఠేశ్వరస్వామి ఆలయ పూజారిగా పిలిపించింది, బరంపురంలో వుంటున్న బసవలింగంగార్ని. పూజారిగా వచ్చేడు బసవలింగం, భార్య శాంతమ్మతో! ఈ ఊరొచ్చిన నాటినుండే బసవలింగం, శాంతమ్మల పేర్లను ఊరి ప్రజలు అయ్యవారూ, అయ్యవారమ్మ అని స్థిరపర్చేరు.

బరంపురం నుండి, కొద్దిపాటి సామాన్లతో, ఊరు చేరిన రోజే, తన పెంకుటింటిలో ఒక గదిలో తమని కూర్చోబెట్టి, పెద్దపళ్ళెంలో బియ్యం, మిరపకాయలూ, చింతపండూ, ఉప్పు, పెసరపప్పు, బంగాళాదుంపలూ భత్యం తీసుకొచ్చి –

"అయ్యవారమ్మా! ఈ పూటకి, మా పొయ్యి మీదనే భత్యం వొండుకోండి. సాయంత్రానికి మీకు ఇల్లు అప్పజెప్తాము..." అంటూ ఆదరించింది చంద్రమ్మ.

చంద్రమ్మ ... తన యీడుదే! కాకపోతే కాస్త పొడగరి, సన్నంగా బొప్పాయి మొక్కలా వుంటుంది. కాళ్ళకి కడియాలు, మెడకి నానూ, పట్టెడ, చెవులకి యెత్తు గొలుసులూ నిండుగా పూచిన సన్నజాజిలా అలంకరణల్తో కన్పించింది. చంద్రమ్మ ఆ సాయంత్రానికి అన్నట్లుగానే ఇల్లు అప్పగించింది.

నాగావళి నది ఒడ్డున నీలకంఠేశ్వరాలయం. ఆలయంకి ముందు కొద్ది దూరంలో మామిడి తోట, ఈ తోటకి దోవతీస్తుంది నాయుడు వీధి. చంద్రమ్మ గారి పెంకుటిల్లుకి, ఎదురు వాసలో రెండుగదుల పూరిల్లు అప్పజెప్పింది.

“…ఎలగుంది అయ్యవోరమ్మా ఇల్లు?” అనడిగింది చంద్రమ్మ. ఏమీ చెప్పలేదు జవాబు. తదేకంగా చంద్రమ్మనే చూస్తూ వుండిపోయింది.

“…దిస్టితగుల్తాదయ్యవోరమ్మా! ఏటలగసూస్తావు నన్ను? రైతువోరి ఆడోళ్లం, ఈ సరుకూ, సప్పరా వుంటేనా మా అందం! నీలాగ … మల్లిపువ్వు అందం మా కుండదు…” అంటూ కపటం లేకుండా గలగలా మాట్లాడింది చంద్రమ్మ. ఆ రోజే మనసారా “అప్పా” అని చంద్రమ్మను పిల్చి, కౌగిలించుకుంది తను! ఆ నాటి నుంచీ, అప్పా చెల్లెల్లులా బ్రతికేరిద్దరూ!

❊ ❊ ❊

పొయ్యిమీద నుంచి కషాయం దించి, గ్లాసులో కొద్దిగా పంచదార వేసి తొరిపింది. చెంబులో కషాయంతో, గ్లాసు మూతపెట్టి తీసుకొచ్చి చంద్రమ్మను లేపింది అయ్యవారమ్మ. గ్లాసులో కషాయం పోసి, అందిస్తూ –

“ఇదా, కొంచెం తాగి, ఇముడ్చుకో, ఊస్టం తగ్గుతాది” అంది.

“కసాయింకి బదులు ఇంత యిసం కలిపీసిచ్చిద్దూ. తాగీసి చస్తాను” గ్లాసు అందుకుంటూ పలికింది చంద్రమ్మ బాధగా.

“…ఏమీ? నేనిలగ బతకటం నీకిస్టంలేదా? మిలట్రీ భోజనం (జైలులో భోజనానికి పల్లెటూరివారి పేరు) పెట్టిస్తవేటి నాకు? నీ కొడుకో, కోడలుకో సెప్తే ఆ పనేదో సంతోషంగా చేస్తారు, నన్ను బతిమాలడమేల?” అని హాస్యధోరణిలో జవాబు చెప్పింది అయ్యవోరమ్మ.

చంద్రమ్మ రెండు గుక్కలు కషాయం మింగింది. గొంతు మిరియాల కారానికి మండింది. పెదవులు చప్పరిస్తూ … యిస్‌కొట్టింది. నోటిలో లాలాజలం ఊరింది. గింజుకుని మింగింది.

“…పోషించే పెనిమిటి పోయేడు. గెంజిపోయాల్సిన కొడుకు తప్పుకు తిరుగుతండు. ఈ ఇంతనువ్వేనా ఆదుకోపోతే నాగతి యేటి?” అనడిగింది చంద్రమ్మ.

“…అందరికీ దేవుడే గతి!” రెండు చేతులు జోడించి, మీదకి మొక్కుతూ చెప్పింది అయ్యవారమ్మ.

“పెసిరెంటు కౌలు యిచ్చేడా? సొయం పాకం (స్వయం పాకం) కేనా భత్యమిస్తండా?” అనడిగింది చంద్రమ్మ దేవాలయ భోగట్టా! అయ్యవారమ్మ ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేదు. మౌనంగా, చంద్రమ్మనే చూస్తూ వుండిపోయింది.

❊ ❊ ❊

పెరట్లో పండిన కూరగాయ, పొలంలో పంట … యేది అయినా చంద్రమ్మ ముందుగా అయ్యవారమ్మ కిచ్చి తర్వాతే తన యింటికి చేర్చేది. ఏ జన్మలోనో నిజంగా తోబుట్టువులే మీరు; యీ జన్మలో ఇలా కలిసారు అనేవాడు అయ్యవారు.

చంద్రమ్మది లంకంత కొంప. సాలనిండా పశుసంపద. నీలకంఠేశ్వరస్వామి ఆలయ మాన్యం భూమి అయిదెకరాలు గాక మరో అయిదెకరాల పల్లపుభూమికి, చంద్రమ్మ కన్నవారు పసుపుకుంకుమల కింద యెకరా భూమి కలిపేరు. చంద్రమ్మ భర్త గుంపస్వామి నాయుడుకి ... పొలంపనీ; కళ్ళంలో రైతుల్తో కబుర్లూ తప్ప మరేవీ పట్టవు. చంద్రమ్మదే ఇంటి బరువూ, బాధ్యత.

భోగభాగ్యాలు అనుభవించింది. ఇంటి పరువూ ప్రతిష్ఠా పెంచింది. ఆడపడుచులు ముగ్గురికీ, స్థాయికి తగ్గ సంబంధాలు చేసింది. సారెచీరలు పెట్టింది. ఎక్కడనుంచి తెచ్చి, ఈ పెళ్ళీ పేరంటాలు చేసిందో ఎన్నడూ ఆలోచించేవాడుగాదు భర్త! ఎక్కడో మంచి ఆవు వుందంటే, బేరం జేస్సి తోలుకొచ్చేవాడు ... దానికి డబ్బు వ్యాపగించి యిచ్చేది చంద్రమ్మ. కురుపాం జమీందార్ల దగ్గర మైసూరు ఎద్దులున్నాయి, అమ్మేస్తారంటే ... పరుగెత్తికెల్లి ... కొనుక్కొచ్చేడు భర్త ... ఓసారి! వాటికి డబ్బు కోసం చంద్రమ్మ మెడలో పట్టెడ, నానూ అమ్మేసింది. 'సంగం' యాత్రకు ఆ ఎడ్లబండిలో వెళ్ళినపుడు –

"బావని గదమాయించకపోయేవా అన్నావు! బంగారమేల అమ్మేవన్నావు! బావయేటి జేసినా కాదన్లేను! అయినా, బంగారం లాంటి ఈ ఎడ్లు మనకెలాగొస్తాయి...?" అంది చంద్రమ్మ అయ్యావారమ్మతో. ఆ ఏడాది శివరాత్రికి ఆ ఎడ్లబండి మీదనే, సంగం, తోటపల్లి, గుంపయాత్రలకు వెళ్ళేరు.

అప్పటికే నలుగురు బిడ్డల తల్లి అయింది చంద్రమ్మ. ముగ్గురు ఆడపిల్లల తర్వాత కొడుకు పుట్టాడు. అత్తగారి వంశవార్షికమట! నాలుగో సంతానం కొడుకు పుడతాడట! చంద్రమ్మకి కొడుకు పుట్టేక ఒకటొకటిగా ఆపదలు రాసాగేయి. నీలకంఠేశ్వరస్వామికి క్షీరాభిషేకం చేయించింది ఆపదల నుంచి గట్టెక్కాలని.

ఏటకేటా, వర్షాలు తగ్గిపోయి పంటలు పోయేయి మూడేళ్ళు. మదుపులు మాత్రం తప్పేవిగాదు. అప్పుల్తో గట్టెక్కాల్సివొచ్చేది మూడేళ్ళూ. పంటల్లో మార్పులొచ్చేయి. వరిపంట తగ్గించి, వాణిజ్య పంటల్లోకి దిగేరంతా. జనుము, వేరుశనగ, పొగాకు పండించేరు. పండిన పంటకి ధర తగ్గిపోయేది. పండించని పంటకు ధర ఎక్కువ వుండేది. ధర ఎక్కువుంది గదా అని ఆ పంట యేస్తే ఆయేడు ఆ పంటకి ధర పడిపోయేది. చంద్రమ్మ వొంటిమీది బంగారం తనఖాకి, తర్వాత అమ్మకంకీ వెళ్లిపోయింది. సొమ్ములు తీసేసిన అమ్మవారి విగ్రహంలా బోసిగా కన్పించేది చంద్రమ్మ.

ఇంతలో భూములు రీసర్వే చేశారు. ఎందుకు చేసారో, ఎవరికి లాభించిందో తెలీదుగానీ ఆలయం మాన్యంభూమి దేవాదాయ శాఖవారు అజమాయిషీలోకి తీసుకుని కౌలు మార్చేశారు. ఊరి కౌలురైతుల్తోపాటు, చంద్రమ్మ కౌలుకుచేస్తోన్న అయిదెకరాల భూమీ తీసుకొని ఊరి సర్పంచ్‌కి కౌలుకిచ్చేశారు.

❊ ❊ ❊

"...నీ సౌభాగ్యం తరిగినట్టే నీలకంఠేశ్వరస్వామి సౌభాగ్యమూ తరిగిపోయింది. అపుడు, ఆలయ భూములు మీ చేతిలుండీవి. ఆటిమీద పంటలు పండించి మీరూ బతికీవోలు. దేవుడికౌలు దేవుడికీ యిచ్చేవోరు. అపుడెలా గుండీదీ కోవెల? కళకళలాడేది. అగరొత్తులు వాసన గర్భగుడి నుండి మండపం దాకా యేసేది. కోవెల చుట్టూ గన్నేరు, నందివర్ధనం, మందారం... పూలమొక్కలుండేవి. తులసి వొనమే, వనం! ఇప్పుడో!? ప్రహరీ కూలిపోయింది. గర్భగుడి గచ్చు పెచ్చులూడిపోయింది. సున్నం మొకం జూసి ఎన్నాళ్ళయ్యిందో కోవెల!" చంద్రమ్మ ప్రశ్నకు కోవెల పరిస్థితి చెప్పుకొచ్చింది అయ్యవారమ్మ.

"...దేవుడి పోషణకేనా యివ్వకండా అంతా నొల్లీడానికి ఆ పెసిరెంటుకి యెలగ మనసొప్పుతంది? దేవుడిమీద భక్తీ, భయిమూ రాన్రానూ తగ్గిపోతంది గదా అయ్యవోరమ్మా ప్రజలకి?" అనడిగింది చంద్రమ్మ కషాయం మరో గుక్క మింగి!

"...భయిం, భక్తీ తగ్గిందనీ అన్లేము. అన్నిటికీ మార్పులొచ్చినట్టగే దేవుడికీ వొచ్చింది. అయ్యప్ప స్వామి బృందం, సాయిభక్త సమితి, బాబాభజన సంగం ... వీధికొకటి లేవేటి?" ప్రశ్నిస్తూ జవాబిచ్చింది అయ్యవారమ్మ.

"...ఈ భక్తులికి కోవిల సంగతక్కర్లేదన్నమాట?" చంద్రమ్మ.

"...దేవుడి కింత ప్రసాదంకి దిక్కులేదు. అంత ఆలయభూమి వుండికూడా! కొడుకు మురళి, టైలరింగ్ నేర్చుకోబట్టి పనికొచ్చింది, మాకు ఇంత ముద్ద కూడూ, దేవుడికింత ప్రసాదమూ సంపాదించుతండు" అని చెప్పింది అయ్యవారమ్మ.

చంద్రమ్మ, కషాయిం అంతా తాగేసింది. గ్లాసు అయ్యవారమ్మకు యిచ్చింది. ఎదురింటి వీధి తలుపు తెరుచుకుంది. దీపం పట్టుకొచ్చి, గడపమూలన పెట్టి, దాని ఎదురుగా కూర్చొని – రోజా పుస్తకం తీసి చదవసాగింది.

చదువుతోన్న రోజాను చూసి, అయ్యవారమ్మ రమ్మని కేకేసింది. రోజా చదువుతున్న పేజీలో గుర్తుగా పెన్సిలు పెట్టి, పుస్తకం మూసేసి, వొచ్చింది. మంచమ్మీద నాన్నమ్మ గుడ్డకప్పుకు, వొణుకుతుండటం చూసి –

"నాన్నమ్మా, జ్వరమా?" అనడిగింది, దగ్గరగా వచ్చి రోజా. ఆ మాత్రం ఆప్యాయతకే చంద్రమ్మలో కడుపులోంచి దుఃఖం కదిలింది. కంటనీరు దించింది మౌనంగా.

అయ్యవారమ్మ రోజాను –

"రోజా, మీ నాన్న లేడేటమ్మా?" అనడిగింది.

"బియ్యంకోసం వెళ్ళాడట. ఒక క్షణం కిందట, మంగలి కన్నయ్య చేత బియ్యం పంపించేసి, ఎలక్షన్ గదా ఎవరో మీటింగ్ పెట్టారట ... అక్కడుండి పోయాడట. మా అమ్మ కోప్పడుతోంది." రోజా బదులు చెప్పింది.

"ఎన్నో క్లాసు సదువుతన్నావమ్మా?" చంద్రమ్మ అడిగింది.

"సిక్స్ పాసయి, సెవెంత్ కొచ్చేను..."

"అంటే – ఎన్ని?"

"ఏడు" చెప్పింది రోజా. ఇంతలో రోజా తమ్ముడు "ఒలక్కా, అక్కా.." అంటూ పిలుపుకొచ్చాడు. అయ్యవారమ్మ శంకరిని దగ్గరకు తీసుకొని –

"శంకరీ మీ నానమ్మకి జొరంరా, మందులు తేగూడదూ?" అంది.

"...జొలంకి యింజీసన్ చేస్తే జొలం సచ్చిపోద్ది. నేను పెద్దయితే డాక్టరయి, నానమ్మకి యింజీసన్ చేస్తాను. మలెప్పుడు జొలంలాదు..." అని చేతులూపుకుంటూ చెప్పాడు వాడు.

వాడి మాట తీరుకు చంద్రమ్మ ఆనందంతో పొంగిపోతూ –

"...నా నాయిన! ఎంత అప్మానం (అభిమానం) రా నీకు నామీద. నువ్వు పెద్దోడివయీ డాకటేరయీ, యిండీసన్ చేసేదాకా బతుకుతాన్రా మనవడా! తప్పకండా బతుకుతాను..." అంది.

"డాక్టరు బాబూ, మరి నాకు మందులివ్వవా? మీ నాయనమ్మకేనా" అని హాస్యమాడింది అయ్యవోరమ్మ.

"ఓ ఎందుకివ్వనూ? నీకు జొలమొస్తే నాదగ్గిలికే ...లా! తప్పకుండా యింజీషనిస్తాను..." అని హామీ యిచ్చేడు శంకరి.

పెద్దచదువులు చదివించి, ప్రయోజకుణ్ని చేయాలనుకున్నారు తమ కొడుకుని చంద్రమ్మా, భర్త గుంపస్వామినాయుడు! ఒక్కగానొక్క కొడుకుగదా, ఆడబిడ్డల్తో. అందుకని, పొలం పనిలో చేర్చకుండా, పాఠశాలలో చేర్చారు కొడుకుని.

కొడుకు సూర్యనారాయణ కోటిపాం హైస్కూల్ చదువయిపోయింది. కాలేజి చదువుకి విజయనగరం పంపించేరు. ఆ ఏడాదే, పెద్దకూతురి పెళ్లి చేసింది చంద్రమ్మ. ఇటు కొడుకు కాలేజీ చదువుకి, అటు కూతురు పెళ్ళికీ మిగిలిన అయిదెకరాలలో రెండెకరాలు అమ్మక తప్పింది కాదు, చంద్రమ్మకు.

సరిగ్గా, ఆ రోజుల్లోనే 'అర్తాం'లో సుగర్ఫ్యాక్టరీ పెట్టారు. రైతులు చెరుకు పంటకి దిగేరు. చెరుకు గడ తీపికి అలవాటు పడి, ఎలుగుబంట్లు పొలాలకు దిగేవి. ఓ సాయంత్రం వేళ... పొలంలో చెరుకు మడి యీ కొసనించి చూసుకుంటూ వస్తోన్న గుంపస్వామినాయుడు మీద ఓ పిల్లల ఎలుగు దాడిజేసింది. చావుదప్పి కన్ను లొట్టబోయింది నాయుడుకి. అప్పట్నించీ మరి, నాయుడు పొలంపనికి పనికిరాని అవిటివాడైపోయాడు. కళ్లానికీ, యింటికీ పరిమితమైపోయాడు. అందరూ అతనిని ... బంటి గుంపస్వామి అని పిలవసాగేరు.

చెరుకు పంటకు ఎరువూ, మందులూ, మమ్మూ అప్పుకింద అందిచ్చిన కంపెనీ చెరకుకి కిట్టుబాటు ధర రైతుకివ్వలేదు. మరో ఏడాదైతే, క్రషింగుకి పర్మిట్లూ యివ్వలేదు. ఫ్యాక్టరీ, కార్మికుల సమ్మె కారణాన ఆగిందనీ! చెరకు పిప్పిలా మిగిలారు రైతులు. చంద్రమ్మ ... సంసార సాగరంలో ... కాళ్ళూ, చేతులూ అందని లోతుల్లోకి దిగిపోయింది.

చదువుకోసం పంపితే – కొడుకు సరదాలు నేర్చుకున్నాడు. సరసాలు సాగించేడు. మెస్‌లో భోజనం జేసే సూర్యనారాయణ, ఆ మెస్ యజమాని కూతురు సరోజతో ప్రేమ పాఠాలు చదివేడు. డిగ్రీ మధ్యలో ఆపేసి సరోజ మెళ్లో తాళి ముడేసి, ఇంటికి తీసుకొని వచ్చేడు.

✳ ✳ ✳

సరోజ గడపలోంచి పిల్లల్ని కేకేసింది... రమ్మని.

"నాన్నమ్మా, వొస్తాను..." అని చెప్పి రోజా ఇంటికి పరుగెత్తింది. "ఒలక్కా, ఉండే..." అంటూ వెనకాలే పరుగెత్తాడు శంకరి. చెంబూ, గ్లాసూ తీసుకొని అయ్యవారమ్మ లేచి –

"...మా బాబు మురళీ గూడ ఇంకా రాలేదు. ఈడూ ఆ ఎలక్షన్ మీటింగు కాడే వున్నాడేటో...? అంది.

"...ఎవులెవులికమ్మా పోటీ?" అనడిగింది చంద్రమ్మ.

"...కాంగిరేసోలికీ, తెలుగుదేశమోలికీ..." చెప్పింది అయ్యవారమ్మ.

"అలక్కాదు మనయేరియాల, ఎవులి మద్దెన పోటీ?" అనడిగింది చంద్రమ్మ మళ్ళీ.

"...ఎవురెవురి మద్దెనో ఎందుకుంతాది పోటీ? మనకి లేరా? కురుపాం రాజులూ, మేరంగి రాజులూ! ఆ రెండు కోటలు మద్దెనే పోటీ!" అని చెప్పింది అయ్యవారమ్మ.

"అలక్కాదమ్మా. ఇపుడా రెండు కోటల వాళ్ళూ సఖ్యమైపోయి ఒకే పార్టీ అయిపోయారు. ఆల్లకీ, మరొకాయన, పేదోడ్లే ఆయనకీ మధ్యపోటీ!" అని ఆ ప్రాంతంలో శాసనసభకు ప్రతినిధులుగా పోటీపడ్తోన్నవారి గురించి చెప్పాడు మురళీ, అపుడే అక్కడికొచ్చి.

"ఆహా! పోన్లే. ఎవులిమద్దెన పోటీ అయితే మనకేలగానీ పద, పదా ... ఇంకా వంటవలేదు. చెంద్రప్పా అలాగ కళ్ళు మూసి పడుకో. మళ్ళా పొద్దున్నొస్తాను..." అని చెప్పి అయ్యవారమ్మ లేచింది.

కోకగుడ్డ... కాళ్ళతో సర్దుకు కప్పుకోసాగింది చంద్రమ్మ! గుడ్డను శుభ్రంగా కప్పి అయ్యవారమ్మ, మురళిని పదమంటూ ... కదిలింది! ఆమె మనసులో ఎన్నో ప్రశ్నలు!

ఎలాంటి చంద్రమ్మ...? ఆఖరికి...!?

నీలకంఠేశ్వరస్వామి ఆలయ సౌభాగ్యం తరిగిపోవడానికి కారణాలు తెలిసినంత స్పష్టంగా – చంద్రమ్మ సౌభాగ్యం తరిగిపోవడానికి తెలియటంలేదు ఆమెకు!

* * *

బారెడు పొద్దు... ఎర్రగా ఆకసాన పరుచుకుంది. మూడ్రోజులైంది ముసురు వొదిలేసి. పక్షులు రెక్కల్ని చాచుకుంటూ ఆహ్లాదంగా ఆకాశంలో ఎగురుతున్నాయి. తుమ్మెదలు... నందివర్ధనం పూలమీద వరుసగట్టి వాల్తున్నాయి. తూరీగలు ... గన్నేరు పూవుల్తో ఆడుకుంటున్నాయి. నీలకంఠేశ్వరస్వామి ఆలయం ధ్వజస్తంభం మీద కోయిల ధీమాగా కూర్చుని కుహుకుహూ రాగాలు పోతోంది. నాగావళినది ఒడ్డుమీది రెల్లుపొదలు ... చిరుగాలికి పులకరింతల్తో కదులాడుతున్నాయి. నదికి నీళ్ళకోసం వెళ్ళే ఆడవాళ్ళ చేతిగాజుల గల, గలలు, కాలి అందెల రవళులు స్వరపరికరాలై ... సంగీతమయంగా విన్పిస్తోన్నవి. వాతావరణం ఆహ్లాదకరంగా వుంది.

ఆలయం ముందరి మండపం మీద కూర్చున్న అయ్యవారు... చాలాసేపటి నుంచీ మౌనంగా వున్నారు. అయ్యవారికి కొద్దిగా ఎడంగా, పోలయ్యమామ, లచ్చయ్యతాత కూర్చున్నారు. అప్పటిదాకా కూర్చుని, అసహనంగా లేచి నిల్చున్నాడు సూర్యనారాయణ. ఈ వాతావరణం అసహనంగా వుంది సూర్యనారాయణకు.

మూడు రోజులనుంచీ, ఇంట్లో అయ్యవారమ్మ రోజూ చెప్తోంది. ఈ వాళ్టికి కుదిరింది అయ్యవారికి. సూర్యనారాయణను పిలిపించేడు... తోడుగా, యిద్దరు కులపెద్దల్ని కూచోబెట్టుకున్నాడు అయ్యవారు.

సూర్యనారాయణ వచ్చేక విషయం ఎలా ఎత్తుకోవాలో అన్న మీమాంసతో మౌనం వహించేడు అయ్యవారు. పోలయ్యమామ మాత్రం ... మూడు రోజుల కిందట రాజకీయ నాయకుల మీటింగ్ విషయం ఎత్తాడు. పోలయ్య... గతంలో యింటింటా తిరిగి, పిల్లలు కూడబెట్టే జనపనార కొనేవాడు. రాన్రానూ, రైతులకు వందా, వెయ్యి అప్పులిచ్చి, అడ్వాన్సు లిచ్చి, రైతులు పండించే జనపనారను కొనే స్థాయికి ఎదిగాడు. అందరితో హాస్యాలాడుతూ అన్ని విషయాల్లోకీ దూరుతూ కలుపుగోరుగా తిరిగే పోలయ్యను అందరూ పోలయ్యమామ అని పిలుస్తుంటారు. పోలయ్యమామ, ఏ రైతయినా చిదిగిపోయి, పొలం అమ్మకం పెద్తాడా అని ఎదురు చూస్తుంటాడు.

లచ్చయ్యతాత మౌనంగా, పొగాకు రెమ్మను సాపుజేసి చుట్ట తయారుచేసుకుంటున్నాడు. అసహనంతో, లేచి నిల్చున్న సూర్యనారాయణ –

"పురుమాడ గుడ్డిమీద కెల్లాల, పనున్నాది" అన్నాడు.

"...అయితెలిపోరా! పెద్ద రైతోడివిగదా నువ్వే. ఇవతల మీమెపులిమీ రైతులమా? పనులున్నోలిమా? ఎలిపోరా అయితే!" అని కోపగించాడు లచ్చయ్యతాత, సూర్యనారాయణపై.

లచ్చయ్య ఊరందరికీ తాత! అంత పెద్దవయసాయన! లచ్చయ్యతాతకు అసలీ తగువంటేనే కోపంగా వుంది. తల్లీ కొడుకులే వేరుకాపురాలు పెట్టుకోడం నచ్చదు. లచ్చయ్యతాత కుటుంబాలు ఉమ్మడిగా వుండాలంటాడు. ఇప్పటికీ తన ఇంటిని అలాగే నడుపుకొస్తున్నాడు. కొడుకులు నలుగురికీ పెళ్ళిళ్ళయ్యేయి. మనవళ్ళూ కొడుకుల్తో ఉమ్మడిగా కుటుంబాన్ని నిలుపుకొస్తున్నాడు. ఉమ్మడి కుటుంబాల్లో ఆనందమే గొప్పది, అందరితో పంచుకొనేదీ అంటాడు. ఉమ్మడి కుటుంబం వల్ల అందరూ తలా ఓచెయ్యివేస్తే... ఎంతపనైనా సులువుగా అయిపోతుందిగదా అంటాడు. లచ్చయ్యతాతంటే ఆ వూరిలో అందరికీ అందుకే గౌరవభావముంది. లచ్చయ్యతాత ఆ మాట అన్న తరువాత సూర్యనారాయణ నిల్చున్నచోటనే అలా వుండిపోయేడు. జవాబూ ఇవ్వలేదు. కదలనూ లేదు.

అప్పటికి, అయ్యవారే మౌనంవీడి –

"...మీ అమ్మకి మూడ్రోజులుగా జ్వరం. మందూ, మాకులేక మంచమ్మీద మూలుగుతోంది" అన్నాడు, తర్వాత సంభాషణకు ఉపోద్ఘాతంగా.

"...మందూ, మాకేటి? ఇన్ని గెంజినీళ్ళకి గతిలేకపోయింది. కనీసం దివ్వయెలిగించడంకి కిరసనూనైనా లేదట..." అని చెప్పాడు పోలయ్యమామ.

"ఆ సంగతి ఆడికి తెల్దేటి, నువ్వు సెప్తున్నావు? ఏటి ఆలమ్మకి దూరాబారా నున్నాడా? కళ్ళకెదురుగా వుంది కాదేటి... ముసిల్ది? కనబడదేటి ఆడికి?" అని కసురుకున్నాడు లచ్చయ్యతాత.

అయ్యవారికి వ్యవహారం సాఫీగా జరిపించాలని వుంది తప్ప, సూర్యనారాయణను ముద్దాయిని చేసి తగువు సాగదీయాలని లేదు. పదేళ్ళ వయసులో వుండివుంటాడు, సూర్యనారాయణ అయ్యవారు ఈ ఊరొచ్చినపుడు. అప్పట్నించి, సూర్యనారాయణను చూస్తున్నాడు. అందరికంటే తనకే సూర్యనారాయణ గురించి బాగా తెలుసు.

సరోజినిని పెళ్ళిజేసుకున్నాక సూర్యనారాయణ ఊర్లోకి వచ్చేక తిన్నగా కోవిలకే వచ్చాడు. వధూవరులిద్దరూ నీలకంఠేశ్వరస్వామికి దండాలు పెట్టి తర్వాత అయ్యవారి కాళ్ళకు దండం పెట్టారు. సూర్యనారాయణ, అయ్యవారిమీదనే తన అమ్మా, నాన్నలు తన పెళ్ళిని అంగీకరించేట్లు చేసే బాధ్యతను పెట్టాడు. ఈ బాధ్యతను అయ్యవారు నెరవేర్చాక అన్ని విషయాలూ సూర్యనారాయణ అయ్యవారితోనే సంప్రదించేవాడు. గడిచిన గతమంతా... అయ్యవారెరగనిది కాదు. గతంలోంచి చూస్తే... వర్తమానం సక్రమంగా అర్థమవుతుంది.

"...నిన్నా, మొన్నా, అయ్యవారమ్మే కషాయిమదీ యిచ్చింది మీ అమ్మకి. ముసిల్దాయి. చచ్చీలాగుందని అయ్యవారమ్మే చెప్పింది..." అని అయ్యవారు చంద్రమ్మ పరిస్థితిని చెప్పాడు సూర్యనారాయణకు. ఆ పరిస్థితిలో వున్న తల్లికోసం ఏ త్యాగమన్నా

చేయాలన్న బోధన ధ్వనించింది ఆయన మాటలలో. సూర్యనారాయణ అది గ్రహించేడో, లేదో గాని ఆ మాటలకు లచ్చయ్యతాతే స్పందించి –

"...ఎపుడు సస్తాదా అని సూస్తన్నాడు గావాల? భేష్, సెభాస్ నీలాంటి కొడుకులుంటే ఆ తల్లిదండ్రులు అదేటండీ, అయ్యవోరో పున్నామనరకమా? దాన్నిక్కడే సూసేస్తారు" అన్నాడు సూర్యనారాయణను నిరశిస్తూ.

సూర్యనారాయణ ఈ మాటకూ జవాబివ్వలేదు. తలదించుకు నిల్చున్నాడు. దీర్ఘాలోచనలో నేలచూపులు చూస్తున్నాడు.

❊ ❊ ❊

సరిగ్గా అప్పుడూ యిలానే తలదించుకు నిల్చున్నాడు.

"పెద్దలు అని ఆలోసించేడా? తల్లి దండ్రులం వున్నామని సూసేడా? మా పెద్దరికం ముక్కలుజేస్సి, మూడు ముళ్లేస్సి ముకం సూపించేడు. అపుడూ, నువ్వే నచ్చసెప్పావ్. కాలం మారిందన్నావ్. కుర్రోళ్ళు పూర్వంలాగుండరన్నావ్. అయ్యవోరివి, నువ్వు అంత యిదిగా సెప్తే కాదన్లేకపోనాం. కన్నకడుపు గదా కొడుకు తలమీద అక్షింతలు ఎయ్యిలేకపోనామన్న బాధని దిగమింగుకున్నాం. దిష్టి దిగతుడిసి... యింటిల అడుగు పెట్టనిచ్చేం!

ఏటిజేసాడు? ఇంటిల అడుగు పెట్టినోడు యేటి జెయ్యాల? ఏటి, అంతకమునుపు లాటి సంసారమా? కూచోని తిండానికి! తండ్రి చూస్తే అవిటోడయిపోనాడు. తల్లి జూస్తే, ఆడముండ, వయసుడిగింది. ఇంకా ఈ బదవలెత్తుతాదా అని ఆలోసించేడా? నా బరువేమేనా అందుకున్నాడా? నువ్వే సూసేవ్... సెప్పు అయ్యవోరూ? ఎప్పుడెత్తుకోలేదు. పోనక్కర్లేదు. అలాగుండమన్నాను, ఉన్నాడా? రొండో బిడ్డకి యిటు పెళ్ళి జేసాను. తోడబుట్టినదాని పెళ్లికి అన్నదమ్ముడుగా... ఏటి కస్టపడిపోనాడు? ఆ పెళ్ళికి రెండెకరాలు భూమి తనకాయెడితే ఆ తనకాని క్రెయం అమ్మకం చేస్సిన దాకా ఒప్పేడా? ఇంటిల రణపోరు బెట్టేడు. ఆ భూమి అమ్మీసి, ఆ సొమ్మందుకోని పెళ్లంతోటి పట్నమెలిపోనాడు! అపుడే అనుకున్నాను ఇక మరీ ఇంటిని యెత్తీదించవొలిసింది కొడుగ్గాదని. కానీలే ఏటింకా మునిగిపోడంకి మిగిలిందీ? ఆఖరిదాని పెళ్ళి మిగిలింది. ఆ వున్న ఎకరా అమ్మేసి... ఏ అయ్యనో చూసి యిన్ని అక్షింతలు ఏసేస్తాను. ముసిలోలి మిద్దరిమీ నా కన్నోరిచ్చిన మడిసెక్కల్తోటి బతికేస్తాం అనుకున్ను!

మళ్ళా యిదేటి? ఎలిపోయినోడు ... ఎందుకొచ్చేడు? ఇంకేటి మిగిలింది? సెప్పు అయ్యవోరో సెప్పు!" అని చంద్రమ్మ – విపులంగా ఇంటి పరిస్థితిని చెప్పి నిలదీసింది అయ్యవారుని!

సూర్యనారాయణ – పట్నంలో బ్రతకలేక, బ్రతుకుదారిలేక తిరిగొచ్చేసేడు.

అంతకుముందు – ఇక్కడకంటే ... పట్నంలో మంచి ఉపాధి దొరుకుతుందని

వెళ్ళాడు. వెళ్ళడానికి ముందు...ఇక్కడ ఎంతో సతమతమయ్యేడు. కులాసాగా కాలేజీ బ్రతుకు బ్రతికినవాడు మాట నిలబెట్టుకోడానికి పెళ్ళిజేసుకొని ఊరొచ్చాక పొలంలో కష్టపడ్డాడు. గానీ, ఆ కష్టం ఇంగ్లీషు మాస్టారు తెలుగు మాస్టారి డ్యూటీ చేసేట్లుగా వుండేది. అటు సరోజిని అసలు పొలం పనులకి అలవాటు కాలేకపోయింది. ఇంటిలో వంటా, వార్పూ, పశువులకు కుడితినీళ్లు, సాలలూడ్వటం, ఏదీ చేయలేకపోయేది. ఏడాది, కేడాదీ ఈ నిర్బంధ శ్రమ జేసినా ఋతువుల్తో జూదంలో వ్యవసాయం మదుపులు గిట్టుబాటయ్యేవికాదు. పట్నంలో అత్తవారి మెస్ ప్రక్కనే, కిల్లీ సిగరెట్ బడ్డీ పెట్టుకుంటే యిక్కడకంటే ఉత్తమమని భావించి భూమి అమ్మకం జేయించి వెళిపోయేడు. అలా వెళ్ళాక కొన్నాళ్ళు పట్నంలో బాగానే గడిచింది. రోజా పుట్టిన ఏడాది దాకా బాగానే వెళ్ళాయి రోజులు. ఆ రోజుల్లోనే, గవర్నమెంటులో నౌకరీకి వయోపరిమితి దాటిపోతోందని ఆందోళనపడుతోంటే ఒక ఆసామీ నౌకీ యిప్పిస్తానని నమ్మించేడు. అయిదువేలు అర్పణ జేసాడాయనకి ఎక్కడో అప్పుజేసి. నౌకరీ రాలేదు. వయోపరిమితి దాటిపోయింది. ఆ ఆసామీ అడ్రస్ కన్పించలేదు. అప్పు యిచ్చిన వాళ్ళు కిల్లీ బడ్డీని సామాన్లతో సహా స్వాధీనం చేసుకున్నారు. నిరాధారంగా నిల్చున్నాడు సూర్యనారాయణ.

అత్తవారి మెస్‌లో ... అయిదు వారాలకంటే ఎక్కువ నిలువలేకపోయేడు.

ఏడాదిన్నర చంటిపాప రోజా ... నాయనమ్మ మీదకి ఎగబాకింది. చంద్రమ్మ అందుకుంది. బుగ్గలు చిదిమి ముద్దాడింది. నాయనమ్మ ఎత్తుకోగానే చంటిది ... బుల్లి పోసింది!

"...నాయనమ్మ మీద ఎంత ప్రేమో చూసేరా?" అని ఆ విధంగా ఘర్షణపూరిత గంభీర వాతావరణాన్ని – తేలికపరిచేడు అయ్యవారు. ఇంట్లోకి అడుగుపెట్టాడు సూర్యనారాయణ భార్యా బిడ్డల్తో!

* * *

"కనీ, పెంచిన తల్లిదండ్రులమీద ఆ మాత్రం అప్మానం లేపోతే ఎలాగరా మామా?" అని, కాస్తా అభిమానమన్నా చూపాలన్నట్లుగా అన్నాడు పోలయ్యమామ!

"...అలాగ తలదించుకుంటే ఎలాగ? అనువులో, మినువులో అనాలగదయ్యా..." అన్నాడు అయ్యవారు.

"...పోనొక పన్జెయ్యిరా! అర్ధరాతిరి, అందరూ తొంగొన్నాక, పెద్దబండ్రాయి తీసి, ముసిల్దాని మీదెత్తీరా. బాధ తీరిపోద్దినీకు" అని గసురుకున్నాడు లచ్చయ్యతాత మళ్ళీ!

అప్పటిదాకా, లచ్చయ్యతాత అన్నవన్నీ భరించేడు. పోలయ్యమామా సలహా యిచ్చేస్తుంటే సహించేడు. గానీ, ఈ ఆఖరి మాటకు ... సూర్యనారాయణ గుండెల్లోంచి దుఃఖం పొంగుకొచ్చి–

"...నేల బుగ్గి నెత్తికి యెత్తుకున్నా... బతుకెల్లకుంటంది. పిల్లల్తోటి నేనూ పస్తులుంటన్నాను. సేరడు గింజలింటిల వుంటే – మీ చెప్పుదీసి కొట్టండి. నా తల్లిమీద నాకు మాత్రం మమకారముండదా? చెయ్యి సాగకే... ఈ యిబ్బందులు..." అని చెప్పాడు సూర్యనారాయణ.

* * *

నిజమే నేల మీద బుగ్గి నెత్తిన పోసుకున్నాడు. ఎకరా నేల తాత్తండ్రులాస్తీ, తల్లి పసుపు కుంకుమ ఆస్తి మరో ఎకరా నేల మిగిలేయి. వాటి మీద కష్టపడ్డాడు. ఇంటి కర్చులకే సరిపోయేది కాదు... ఫలసాయం. ఇంటి ఖర్చులు మారిపోయేయి. కరెంట్ వచ్చింది ఊర్లోకి ఇంటికి వేసాడు. కాన్వెంటొచ్చింది ఊర్లోకి పాపని చేర్చాడు. కట్టుకునే వస్త్రాలు, వాడుకునే వస్తువులూ మార్కెట్లో కొత్తకొత్తవి వస్తే అవి ... ఇంటికి అవసరాలే అయ్యేయి. జీవనవ్యయం గతంకంటే అధికమైంది. ఖర్చులు పెరిగిన నిష్పత్తిలో ఫలసాయం పెరగలేదు. చెల్లెలికి వయసు పెరుగుతోంది. వరుని ధర పెరుగుతోంది. ఇంట్లో తల్లీ, భార్యల మధ్య విభేధం పెరగసాగింది. తల్లికి ... కొడుకుమీద అనుమానం కలగసాగింది. నిత్య ఘర్షణ ... ఇంట్లో రివాజైంది.

"...ఇలాగ యింట్లో గొడవల్తోటి బతకలేను. ఎలాగూ పశివిలు లేవు. సాలా ఖాలీగుంది. దానికి గోడలు తడకల్తోటి లేపేసి ఇల్లు జేసిస్తాను. నన్ను అందులో కెళిపోమంటారో, అమ్మా నాన్నలే ఎళిపోతారో... కనుక్కోండి" అని ఓ రోజు అయ్యవారితో అన్నాడు సూర్యనారాయణ.

అయ్యవారు ఆలోచనలో పడితే–

"...పోషణ గురించి నాది పూచీ. మా అమ్మ భూమిని పండించి, అంతా ఆళ్ళకే యిచ్చేస్తాను. వేరు కాపురాలుండక తప్పదు మరి..." అని నిర్ధారించేడు సూర్యనారాయణ. అయ్యవారికి ... ఇంట్లో ఆడవారి మధ్య విభేధాలు అర్థమయ్యేయి. ప్రత్యామ్నాయం ... మరింకేది? ఆ పాకలో చంద్రమ్మ, గుంపస్వామి నాయుడూ, చిన్నకూతురూ కలిసి కాపురముంటూ వచ్చేరు.

అన్నప్రకారం సూర్యనారాయణ తల్లి భూమిలో పంటను అప్పగించేడు కొన్నాళ్ళు. ఇద్దరు బిడ్డల తండ్రయినాడు. వేరుకాపురాలు పెట్టినా రెండిళ్ళ పోషణభారాన్నీ మోసాడు. ఇంతలో ఆఖరి చెల్లికి సంబంధం వచ్చింది. ఎకరానేల అమ్మేసి పెళ్ళి జరిపించేడు. ఇక మిగిలింది తల్లి పసుపు కుంకుమల క్రింద వచ్చిన ఎకరానేల! దాని మీదనే రెండు కుటుంబాలు అర్ధాకలితో బ్రతుకులీడ్చాలి.

మళ్ళీ దేవాలయ భూమి కౌలు తమకొస్తేనో? తనతోపాటూ కౌలు హక్కు

కోల్పోయిన రైతుల్ని కూడగట్టి ప్రయత్నాలు ఆరంభించేడు. అయ్యవారూ ఆ ప్రయత్నాలకు మద్దతిచ్చేడు. భూమి అయితే రాలేదుగానీ కోవెలకు పోలీసులు వచ్చేవారు. రైతుల్తో రహస్య సమావేశా లౌతున్నాయని అనుమానించేవారు. సూర్యనారాయణ, దేవాలయభూమి కౌలు ఆశకు నీళ్లొదులుకున్నాడు. కూలీనాలీ జేసి కుటుంబాన్ని యీడ్చుకొస్తున్నాడు. చెల్లి పెళ్లయిన యేడాదికి తండ్రి చనిపోయేడు. తండ్రి చనిపోయి ఏడాదైంది.

❊ ❊ ❊

"నిజమేన్రా. కాదన్లేం నీకూ కష్టమే. పిల్లల్తోటున్నావు. పోనీ, ఒక పన్చెయ్యిరా. మీ ముసిల్దాని భూమిని ముసిల్దానికొదిలే. అదే ఎవురికో తనఖాబెట్టీసో, అమ్మేసో ... తిని బతుకుతాది..." అని చెప్పాడు పోలయ్యమామ.

పోలయ్యమామ పొలం ప్రక్కనే యీ పొలం వుంది.

"... అయ్యా, అయ్యవారయ్యా! లచ్చయ్యతాతా! పోలయ్యమామా! మీ దాకా ... ఈ తగువొచ్చినపుడే అనుకున్నాను ... తల్లి పోషణ చూడని కర్కోటకపు కొడుక్కింద జమయిపోనానని!

మా అమ్మ గుణం నాకు తెల్సు. నా సంగతీ మా అమ్మకి తెల్సు. అయితే పేగులు మధ్య ఈ కలహాల్ని తెచ్చిన లేమి ఎందుకొచ్చిందో? ఎలాగొచ్చిందో, వొచ్చింది మా బతుకిలికి!

ఇపుడు, ఆ ఉన్న ఎకరానేలా పోతే ఈ గింజలకీ ఆధరవు పోయి నా పిల్లలు పస్తులుంటారు. అది మా అమ్మకి యిష్టమే అయితే అలాగే దాని భూమి దానినే తీసుకోమనండి. అలాగే చెయ్యండి..." అని చెప్పి ధారలుగా కారే కన్నీటిని తుడుచుకుంటూ అక్కడి నుంచి వెళ్ళిపోయేడు సూర్యనారాయణ!

అయ్యవారు ... ఓ క్షణం దాకా తేరుకోలేకపోయేరు. లచ్చయ్యతాత మాత్రం సూర్యనారాయణ స్థితికి కరుణతో కరిగిపోయేడు. సానుభూతిగా –

"... అదీ అసలు చిక్కు! పాపం ... గుంటడు! కలిమిల పుట్టినాడు, కలిమిలే పెరిగేడు. లేమి కాలం వొచ్చేసరికి ... బరువెత్తుకోవాల్సొచ్చిందాడికి. పాపం...ఆడికీ కష్టమే!" అన్నాడు.

"... ఆళ్ల అమ్మ ఏటంటాదో?" పోలయ్యమామ ఎండుగుల కోసం చూసే కాకిలా ... పలికి, కదిలేడు అక్కడ్నించి.

అయ్యవారికి చంద్రమ్మ సమస్యకు ప్రత్యామ్నాయం దొరకలేదు. ఏమీ ఆలోచించలేక మెదడంతా మొద్దుబారి పోయింది. లేచి, ఇంటివైపు నడిచేడు. లచ్చయ్యతాత నెమ్మదిగా నాగావళి నదివైపు నడిచేడు.

అయ్యవారు ఇంటికొచ్చేసరికి, కొడుకు మురళీ రేడియో పెట్టుకుని వింటూ, ఆనందంగా –

"... అన్ని సీట్లూ అపోజిషనోళ్లే గెల్చారు. గవర్నమెంటు మారిపోద్ది. మరి, ఫర్లేదు. బియ్యం ఇక కేజీ రెం(డ్రూపాయలకి దొరుకుతాయి..." చెప్పాడు తం(డితో!

ఆ మాట విన్న అయ్యవారికి చిక్కుముడి విడినట్లన్పించింది ఓ క్షణం! భూమికి (ప్రత్యామ్నాయంగా ... బియ్యం చవగ్గా దొరుకుతాయి? చిక్కుముడి విడిపోయినట్లేనా? నిజంగానా? భూమికి (ప్రత్యామ్నాయం బియ్యమా? ఏదో ఎరుకలోకి వచ్చింది.

మనుషులూ, సంస్థలూ, (ప్రభుత్వాలూ (ప్రత్యామ్నాయాల్ని వెదుకుతూ ... కాలచ(క్రాన్ని కదిలిస్తుంటారు. ఆలోచనల్లో వున్నాడు అయ్యవారు.

"... అయ్యవోరుబావూ ... బేగిరమ్మీ! చం(ద్రప్ప ... పిలిస్తే పలక్కుంటంది." అని ఎవరో ఆందోళనగా కేకలేశారు. గాభరాగా అయ్యవారూ, ఇంట్లోంచి అయ్యవారమ్మా పరుగెత్తుకు వెళ్ళారు.

చం(ద్రమ్మ కనుగుడ్లు తేలేస్సి, లోకమ్మీద అనంత నిరసనను (ప్రదర్శిస్తూ నిశ్చలంగా ... నులక మంచమ్మీద దీర్ఘని(ద్ర తీస్తోంది.

అయ్యవారమ్మ "చెం(ద్రప్పా..." అని పిలుస్తూనే వుంది. ★

*ఆహ్వానం – జూన్ 1995*